

శోత్రియ భూముల్లో దొంగలు పడ్డారు!
చిన్నపాండూరు పరిధి పాదిరికుప్పం రెవెన్యూలోని శోత్రియ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు.
- 8లో



శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు
శ్రీకాళహస్తీశ్వరాలయంలో మూడవ రోజైన శుక్రవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- 8లో



డయేరియా వ్యాప్తిపై పరస్పర ఆరోపణలు
డయేరియా వ్యాప్తిపై అధికారులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు.
- 8లో

సాక్షి తిరుపతి

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్

8న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయాధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, డీ, బీ, ఎం, ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95338 89902, 79898 10194 సంప్రదించాలని సూచించారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు



పుల్లూరులో గ్రామదేవతకు పూజలు చేస్తున్న నాయకులు , మహిళలు

పెళ్లకూరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి స్వగ్రామమైన పుల్లూరులో శుక్రవారం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం కక్ష రాజకీయాల్లో భాగంగా అక్రమంగా అరెస్టు చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి త్వరలో విడుదల కావాలని గ్రామ దేవతకు పూజలు చేసినట్లు చెప్పారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్ప యాగం చేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని పూజలు చేశారు. ఈనెల 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశం లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి బెయిల్ రాకుండా అడ్డుకోవడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌రెడ్డి, మణినాయుడు, వెంకటాచలం, వీరాస్వామిరెడ్డి, రమణయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

8వ తేదీన డిగ్రీ సీట్ల కేటాయింపు

తిరుపతి సిటీ: జిల్లాలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి ఈనెల 3వ తేదీతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. శుక్రవారం వరకు వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించిన ఉన్నత విద్యామండలి జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలలో ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన సోమవారం సీట్లు కేటాయించనుంది. అదేరోజు సంబంధిత కళాశాలల్లో సీట్లు సాధించి విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 9వ తేదీన కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి.

6 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్ : ఆదాయ వనరు నేపథ్యంలో మద్యం బార్ల కేటాయింపులో జాప్యం లేకుండా కూటమి సర్కారు చకచకా కేటాయింపులు చేస్తున్నారు. జిల్లాలో 32 బార్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో గత నెల 30న 26 బార్లను లాటరీ పద్ధతిలో కేటాయింపు చేశారు. మిగిలిన 6 బార్లను భర్తీ చేయడానికి ఈనెల 14 సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని ఎక్సైజ్ జిల్లా అధికారి నాగమల్లేశ్వర్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. 15న కలెక్టరేట్‌లో ఉదయం 8 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో బార్ల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. ఓపెన్ కేటగిరికి చెందిన ఆరు బార్లలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, వెంకటగిరి పట్టణ పరిధిలో ఒకటి, గూడూరు మున్సిపాలిటీ పరిధిలో రెండు, సూళ్లూరు పేట పరిధిలో రెండు బార్ల ఉన్నాయని చెప్పారు. మూడేళ్లపాటు మాత్రమే లైసెన్స్ ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్‌తో పాటు హైబ్రిడ్, ఆఫ్‌లైన్ లోనూ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని స్పష్టం చేశారు. దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు ఉంటుందని చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకు అయినా దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ బార్లు వచ్చినా నిర్వహించుకోవడానికి అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. 21 ఏళ్లు దాటిన వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 59,834 మంది స్వామి వారిని దర్శించుకోగా 24,628 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

కూలీ కడుపు కొట్టి.. కాంట్రాక్టర్‌కు కట్టబెట్టి

మేమంతా రోజువారీ కూలితో పొట్టపోసుకుంటున్నాం. వచ్చే సంపాదనతోనే కుంటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు మమ్మల్ని కాదని కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తే మేం తీవ్రంగా నష్టపోతాం. బతుకు పోయి వీధిన పడతాం. మా మొర ఆలకించండి. హమీలీల పొట్టకొట్టే ప్రయత్నాలు మానుకోండి.. అంటూ పలువురు కూలీలు వేడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త విధానానికి వ్యతిరేకంగా నిరవధిక దీక్షకు సిద్ధమవుతున్నారు. కూటమి కుట్రలపై సాక్షి స్పెషల్ ఫోకస్

- విద్యుత్ స్టోర్స్ పనులు కాంట్రాక్టర్ సంస్థకు!
- రోడ్డున పడనున్న హమాలీలు
- 15న నిరవధిక దీక్షకు సిద్ధమవుతున్న కూలీలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చిత్తూరు జిల్లా కేంద్రంలోని స్టోర్స్ నుంచి విద్యుత్ పరికరాలు సరఫరా చేస్తున్నారు. చిన్న బోల్టు నుంచి సబ్‌స్టేషన్‌లో బిగించే పరికరాల వరకు ఈ స్టోర్స్ నుంచే తీసుకెళ్తుంటారు. ఇక్కడ 15 మంది హమాలీలు 40 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ఇప్పుడు వారిని తొలగించి కొత్తగా కాంట్రాక్టుకు పనులు అప్పగించాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. దీనిపై హమాలీ కార్మికులు రగిలిపోతున్నారు. తమ పొట్టకొట్టొద్దు బాబూ అంటూ గళం ఇప్పుతున్నారు.

కూలీల్లో కోత

హమాలీలు వీటి పైనే ఆధారపడి జీవిస్తున్నారు.



విద్యుత్ పరికరాలు ఎత్తిపెడుతున్న కార్మికులు

తొలుత కూలి విధానంలో విద్యుత్ పరికరాల లోడింగ్, ఆన్‌లోడింగ్ చేసేవారు. 2008 నుంచి సంస్థలో పీస్‌రేటు సిస్టమ్ అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇక్కడ పనిచేస్తున్న హమాలీ సొసైటీకే కాంట్రాక్ట్ పనులు ఇస్తున్నారు. ఇప్పుడు ఆ పనులను సొసైటీకి కాకుండా విద్యుత్ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాలనే ప్రయత్నం జరుగుతోంది. కార్మికుడు పీస్ వర్క్ కింద వస్తువులను బట్టి రూ.0.25 పైసల నుంచి రూ.1200 వరకు ట్రాన్స్‌కో చెల్లిస్తోంది. రోజూ కార్మికుడు సరాసరి రూ.500–1,500 వరకు సంపాదిస్తున్నారు. సైడ్ హారం పరికరానికి రూ.2–6, తుక్కు కేజీకు రూ.0.70 పైసలు నుంచి ప్రారంభమవుతుంది. 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనంలో పెడితే రూ.230, 63 కేవీ అయితే రూ.375, అదే సబ్‌స్టేషన్‌లో పెట్టే వీసీబీ(బ్రేకర్స్)కు రూ.1,286 ఇస్తున్నారు. ఇప్పుడు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తే వీరందరూ రోడ్డున పడాల్సిందే.



విద్యుత్ పరికరాలు

అనంతపురంలో అమలు చేశారనీ..!



అనేక సంవత్సరాలుగా ట్రాన్స్‌కో స్టోర్స్‌లో పీసు రేటు కింద హమాలీ సొసైటీకి పనులను ఇస్తున్నారు. ఇప్పుడు కార్మికుల కష్టం పై కూటమి నాయకులు కన్నేశారు. ఇందుకు బీజంగా అనంతపురం జిల్లాలో ఆ సొసైటీకి కాకుండా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ విధానాన్ని చిత్తూరు జిల్లాలో కూడా అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

నిరసనకు సన్నద్ధం



ట్రాన్స్‌కో స్టోర్స్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు(ఫైల్)

తమ సమస్యల పరిష్కారం కోసం హమీలీలు సెప్టెంబర్ 14 వరకు జిల్లా స్టోర్స్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి 15న తిరుపతిలో సీఎండీ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షకు పూనుకునేందుకు సిద్ధమవుతున్నారు. తమ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

సొసైటీని కొనసాగించాలి



గత 40 ఏళ్లుగా సొసైటీ ద్వారా విద్యుత్ స్టోర్స్‌లో హమాలీలు పనిచేస్తున్నారు. హమాలీ సొసైటీకి పనులు ఇస్తుండడంతో ఉన్న కార్మికులే కొనసాగుతున్నారు. ఇప్పుడు కొత్తగా కాంట్రాక్టర్‌కు పనులు ఇవ్వడం అన్యాయం. దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతాయి.

– ఆర్యోగదాస్, రాష్ట్ర అధ్యక్షుడు, విద్యుత్ స్టోర్స్ హమాలీ యూనియన్

అన్యాయం



కార్మికుల కష్టాలను తీరుస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. తీరా వారి కడుపు కొట్టాలని యత్నిస్తోంది. ఎక్కడో అనంతపురంలో అమలైన విధానాన్ని చిత్తూరు జిల్లాలో ప్రవేశపెట్టాలని చూస్తోంది. వారికి వసతులు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు పీకేయాలని యత్నించడం అన్యాయం.

– గంగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సీఐటీయూ

వసతులు కల్పించాలి



కార్మికులకు వసతులు కల్పించాలి. ప్రస్తుతం ఇస్తున్న సదుపాయాలను కాలానుగుణంగా మార్పు చేయాలి. ఈఎస్ఐ, పీఎఫ్‌లను రెగ్యూలర్ వాచ్ మెన్లతో సమానంగా ఇవ్వాలి. ఈపీఎస్పీడీసీఎల్‌తో సమానంగా ఏరియా అలవెన్స్‌లు ఇవ్వాలి.

– చిట్టిబాబు, హమాలీ

రోడ్డున పడతాం



కాంట్రాక్టర్‌కు పనులు ఇస్తే మేమంతా రోడ్డును పడతాం. ఎందుకంటే వారు పీస్ రేటు కాకుండా నెలవారీ వేతనాలు ఇస్తారు. సెలవులు పెట్టినా, ఆలస్యంగా వచ్చినా వేతనాలు కట్ చేస్తారు. దీంతో నెలకు రూ.20 వేల వరకు ఆదాయం కోల్పోతాం. మమ్మల్ని తీసేసి కొత్తవారిని తక్కువ వేతనాలకు పనిలో పెట్టుకుంటారు.

– ఆనంద్, హమాలీ

అమ్మవారి సేవలో తెలంగాణ సీజే



తిరుచానూరు ఆలయంలో తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

చంద్రగిరి: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, శాంతారాం స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు పోలేరమ్మ జాతర శాంతి సమావేశం

వెంకటగిరి రూరల్ : పట్టణంలో ఈనెల 10, 11వ తేదీలో జరగనున్న పోలేరమ్మ తల్లి జాతర సందర్భంగా పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు శాంతి సమావేశం ఉంటుందని ఆలయ ఈఓ వెంకట శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సమావేశంలో పాల్గొని జాతర ఏర్పాట్లపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

సమాజ జాగృతిలో గురువులే కీలకం



డీఈఓ కేవీఎన్.కుమార్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, అతిథులు

- జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి కల్చరల్ : సమాజ జాగృతిలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధతో వారి ఉన్నతికి బాటలు వేయాలని కోరారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు వృత్తిపరంగా కాకుండా విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ ఉన్నప్పుడే వారి మధ్య బంధం పెరుగుతుందని, వారి సమస్యలను చెప్పుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, 50 కోట్ల బడ్జెట్ కేవలం విద్యాభివృద్ధి కోసం ఖర్చు పెడుతోందని తెలిపారు. ఉపాధ్యాయులందరూ కష్టపడి పని చేస్తున్నారని, విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, భానుప్రకాష్ మాట్లాడుతూ.. సమాజానికి ఉపాధ్యాయులే మార్గదర్శకులన్నారు. అనంతరం శాప్ చైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం మాట్లాడారు. ఈ సందర్భంగా 68 మంది ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులగా అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్.కుమార్, అడిషనల్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్‌రావు, సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.





ఉత్తమ అధ్యాపకులు సత్కరిస్తున్న జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు

అన్నదాతపై అలుసెందుకు బాబు?

- రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- గిట్టుబాటు ధరలు లేక, యూరియా అందక అవస్థలు పడుతున్న రైతులు
- 9న రైతు సమస్యలపై ఆర్డీవో, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలి
- మీడియా సమావేశంలో భూమన అభినయ్‌రెడ్డి వెల్లడి



యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాల చిత్రాలను చూపిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, నేతలు

తిరుపతి మంగళం : అన్నదాతపై ఎందుకంత చిన్నచూపు చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల రైతు విభాగం అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డితో కలసి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టేలా రైతు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తమ పార్టీ రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అభినయ్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి అధికారంలోకి రాగానే హామీలను గాలికి వదిలేసిన ప్రజా, రైతు ద్రోహి చంద్రబాబు అన్నారు. రైతులకు గతంలో సులభంగా దొరికే బస్తా యూరియా ఇవ్వలేకపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఎరువుల కష్టాలు, బస్తా యూరియా కోసం రోజుల తరబడి క్యూలో నిలబడే దారుణ పరిస్థితి ఉందన్నారు. ఐదేళ్ల జగనన్న పాలనలో ఇలాంటి సమస్య ఎప్పుడూ లేదన్నది వాస్తవం కాదా? అని, ఈ రోజు రైతులు కష్టాలు పడుతున్నారంటే ప్రభుత్వ వైఫల్యం కాదా? అని అభినయరెడ్డి ప్రశ్నించారు.

బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలు

యూరియా, ఎరువులను టీడీపీ, జనసేన నాయకులు దారి మళ్లించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారని భూమన అభినయ్ రెడ్డి ఆరోపించారు. బస్తా యూరియా ధర రూ.267 అయితే బ్లాక్ మార్కెట్లో రూ. 500కు విక్రయించుకుంటున్నారన్నారు. జగనన్న పాలనలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ఎరువులు, యూరియా, సబ్సిడీ వేరుశెనగ వంటివి సకాలంలో అందించామని గుర్తు చేశారు. టీడీపీ నాయకుల జేబులు నింపేందుకు రైతుల కడుపుకొడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా పంటల ధరలు పతనమవుతున్నాయని, ఈ రెండేళ్లలో వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, మినుము, పెసలు, మొక్కజొన్న, సజ్జ, రాగులు, అరటి, చీనీ, కోకో, పొగాకు ధరలు పడిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా చంద్రబాబుకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు, అన్నదాత సుఖీభవ పేరుతో ఇస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చి, వెన్నుపోటు పొడిచారన్నారు. రెండేళ్లకు కలిపి రూ.40 వేలు ఇవ్వాల్సి ఉంటే ఇచ్చింది రూ.5 వేలు మాత్రమేనని, అందులో కూడా సుమారు 7 లక్షల మంది రైతు కుటుంబాలకు ఎగ్గొట్టారన్నారు.

డబుల్ డెక్కర్ బస్సు తిప్పిన ఘనత మాదే...

దేశంలో బాంబే తర్వాత తిరుపతి నగరంలో వైస్సార్‌సీపీ పాలనలో డబుల్ డెక్కర్ బస్సును తిప్పిన ఘనత మాదేనని భూమన అభినయ్‌రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కక్ష పూరిత రాజకీయాలతో డబుల్ డెక్కర్ బస్సును మూలన పడవేసిన ఘనత కూటమి నేతలకే దక్కుతుందన్నారు. అయితే వైజాగ్‌లో చంద్రబాబు, లోకేష్ డబుల్ డెక్కర్ బస్సును కొత్తగా వారే రాష్ట్రానికి మొదటి సారిగా తీసుకొచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఆ విషయాన్ని ఎల్లో పత్రికలో అహో ఓహో అంటూ రాతలు రాయడం వారికే చెల్లిందన్నారు. తిరుపతిలో ఓ దిక్కూ మొక్కులేని నాయకుడు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ మళ్లీ ఫేమ్‌లోకి రావాలని ఆరాట పడుతున్నాడని ఎద్దేవా చేశారు. జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేసినా మళ్లీ ఆ పార్టీ పేరు చెప్పుకుని తిరుగుతూ దళారీ వ్యాపారాలు చేసుకుంటున్న దళారి మా వ్యక్తిగత విషయాలు మాట్లాడే అర్హత నీకుందా అని ప్రశ్నించారు. నీచమైన వ్యక్తిత్వం కలిగిన ఆ వ్యక్తి పేరు కూడా చెప్పడం తనకు ఇష్టం లేదన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రమౌళిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'స్మైల్ ఎకో' ప్రారంభం



శ్రీసిటీలో పరిశ్రమను ప్రారంభిస్తున్న వీఎస్ఎన్ఎల్ మాజీ చైర్మన్ హనుమాన్ చౌదరి, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే 'స్మైల్ ఎకో' ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన పరిశ్రమ శుక్రవారం శ్రీసిటీలో ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీఎస్ఎన్ఎల్ మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున పరుచూరి సమక్షంలో లాంఛనంగా పరిశ్రమను ప్రారంభించారు. రూ.20 కోట్ల పెట్టుబడితో స్థాపించబడిన ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్ల శానిటరీ న్యాప్‌కిన్లను తయారు చేస్తుందన్నారు. దాదాపు 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. దీని ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకు ఎగుమతులు చేస్తారన్నారు.

నాడు ఉద్యోగి, నేడు పారిశ్రామికవేత్త

స్థానికుడైన మల్లికార్జున్ నాడు శ్రీసిటీ ఉద్యోగి కాగా నేడు పారిశ్రామికవేత్తగా మారి స్మైల్ ఎకో' పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఎండీ మల్లికార్జునను ఈ సందర్భంగా డాక్టర్ సన్నారెడ్డి అభినందించారు. మల్లికార్జున పయనం స్థానిక యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశ టెలికాం సంస్కరణలలో ప్రముఖ పాత్ర వహించిన మహోన్నత వ్యక్తి హనుమాన్ చౌదరి చేత ఈ పరిశ్రమ ప్రారంభం కావడం అత్యంత శుభపరిణామం అన్నారు. అనువైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థతో 240 పైచిలుకు పరిశ్రమల స్థాపనతో పాటు ఈ ప్రాంత సామాజిక, ఆర్థిక ప్రగతికి చొరవ చూపుతున్న శ్రీసిటీ యాజమాన్య కృషిని డాక్టర్ హనుమాన్ చౌదరి ప్రశంసించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీసిటీలోని పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండిళ్లలో చోరీ



గదిలో చిందరవందరగా పడేసిన దుస్తులు

చంద్రగిరి : మండలంలో దొంగలు రెచ్చిపోతుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి పట్టణ సమీపంలోని దిగువరెడ్డివారిపల్లిలో గురువారం రాత్రి రెండు తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరిగాయి. ఈ చోరీలో రూ.40 వేల నగదు, 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి అపహరించారని తెలిసింది. ఈ మేరకు బాధితులు గీతా, ఈశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ



విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్/తిరుపతి కల్చరల్ : ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో నాదస్వర, డోలు విభాగాలకు సంబంధించి ఆరేళ్ల సర్టిఫికెట్, డిప్లొమా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు శుక్రవారం కళాశాలలో 46.20 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీవారి విగ్రహానికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థులు నాదాంజలి సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ డీఈఓ కార్యాలయం సూపరిటెండెంట్ శివకుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఉమా ముద్దుబాల, నాదస్వర పాఠశాల హెడ్ బి.లక్ష్మీసువర్ణ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు



మాడ వీధులను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుమల : తిరుమలలోని మాడ వీధులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం పరిశీలించారు. వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు, ఆస్థాన మండపం, బేడీ ఆంజనేయస్వామి, అఖిలాండం తదితర ప్రాంతాలను సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి పకడ్బందీ బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనకు తావు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బారికేడ్లు పెట్టాలని సూచించారు.

75 బస్తాల బియ్యం స్వాధీనం

వడమాలపేట (పుత్తూరు): ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, 75 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.. గురువారం రాత్రి వడమాలపేట మండలం, తడుకు రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహించారు. బొలేరో లగేజ్ వెహికల్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 50 కేజీల బరువు గల 75 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాగలాపురం మండలం, బీరకుప్పం గ్రామానికి చెందిన దినేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

బ్రహ్మాండం!

హోమపూజలు చేస్తున్న దృశ్యం



త్రిశూలానికి క్షీరాభిషేకం చేస్తున్న పండితులు



- వైభవంగా ముగిసిన కాణిపాక బ్రహ్మోత్సవాలు
- ఆగమోక్తంగా వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ

కాణిపాకం: కాణిపాక స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజావరోహణంతో వైభవంగా ముగిశాయి. ఉదయం ఆలయ పుష్కరిణిలో త్రిశూలానికి శాస్త్రోక్తంగా పవిత్ర స్నానం చేయించారు. ముందుగా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సిద్ధి, బుద్ధి, సమేత శ్రీవినాయకస్వామి ఉత్సవమూర్తులను, త్రిశూలాన్ని పురవీధుల్లో ఊరేగించి పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. యాగశాలలో ఏర్పాటు చేసిన 108 కలశాలలోని తీర్థాలను పుష్కరిణిలో కలిపారు. అనంతరం త్రిశూలానికి పవిత్ర స్నానం చేయించారు. ఈ సందర్భంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమున దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు రంగు నీళ్లు చల్లుకుంటూ కోలాహలంగా ఊరేగించారు. తదుపరి యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ యాగమూర్తికి భక్తితో ముగింపు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణంలో భాగంగా ఆలయంలోని స్వర్ణ ధ్వజస్తంభానికి అభిషేక పూజలు నిర్వహించారు. భక్తితో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ధ్వజ స్తంభంపై నుంచి మూషక చిత్రపటాన్ని శాస్త్రోక్తంగా అవరోహణ చేశారు.

వైభవంగా వడాయత్తు ఉత్సవం

రాత్రి స్వామివారికి వడాయత్తు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిగ్రహానికి భక్తితో అభిషేకం నిర్వహించి, పెసర పప్పు పాయసం, ఉద్ది వడలు నైవేద్యంగా సమర్పించి వడాయత్తు ఉత్సవాన్ని చేపట్టారు. అనంతరం స్వామివారికి ఏకాంత సేవను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఉత్సవాలు



కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శనివారం నుంచి ప్రత్యేక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకం జరుగుతుందన్నారు. రాత్రి అధికార నంది వాహనంపై స్వామి వారు ఊరేగనున్నట్టు వెల్లడించారు. ఈ వాహన సేవకు వళ్లువర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

డయేరియా వ్యాప్తిపై పరస్పర ఆరోపణలు

- రిపోర్ట్స్ అన్నీ పాజిటివ్‌గా వచ్చినట్లు అధికారుల వెల్లడి
- డయేరియాకు కారణం తెలపని అధికారులు
- పది మంది హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్



సర్వే కోసం వచ్చిన ఆశా వర్కర్లు

రేణిగుంట : అయిదు రోజులుగా గ్రామంలో డయేరియాకు తాగునీరే కారణమని చెప్పిన అధికారులు ల్యాబ్ రిపోర్ట్స్ రాగానే తాగునీరు సురక్షితంగా ఉందని డయేరియాకు కారణం తాగునీరు కాదని చెబుతున్నారు. కానీ డయేరియా ఎందుకు వచ్చింది అనే ప్రశ్నకు అధికారులు సమాధానం దాటవేస్తుండడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో డయేరియాతో 40 మంది ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. మరికొంత మంది వివిధ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నారు. డయేరియాతో ఇప్పటికే ఇద్దరు మృతి చెందారు. షిరిడిలో మృతి చెందిన మునిరాజా మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తున్నారు. మండలంలోని ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందరూ గ్రామానికి చేరుకొని ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 23 మందిలో పది మంది శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారని వైద్యాధికారులు చెప్పారు. మిగిలిన 13 మంది చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతున్నట్లు చెప్పారు. మండల వైద్యాధికారి చక్రపాణి రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు తమ సిబ్బందితో గ్రామంలో ఉండి పర్యవేక్షిస్తున్నారు. అయిదు రోజులు గడిచినా ఇంత వరకు డయేరియా కలకలానికి కారణం తెలపకుండా అధికారులు ఒకరిపై ఒకరు నిందలేసుకుంటూ కాలం గడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



యాగశాలలో పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మూడవ రోజైన శుక్రవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య పూజల్లో జరిగే దోషాలను సరిచేసేందుకు ఈ పూజలు చేస్తారు. అందులో భాగంగా ఆలయంలోని యాగశాలలో వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు పూజా ద్రవ్యాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి సమస్య మళ్లీ వాయిదా!



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- 40 రోజుల్లో పరిష్కరిస్తామన్న కలెక్టర్
- తుడాకు భూముల బదలాయింపు

తిరుపతి అర్బన్ : శెట్టిపల్లి భూ సమస్యను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా మూడు నెలలకు ఓసారి ఇదిగో అదిగో అంటూ 15 నెలలుగా వాయిదాలు వేస్తూనే ఉన్నారు. తాజాగా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ 40 రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని వెల్లడించారు. లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆ మేరకు కేబినెట్‌లోనూ చర్చ జరిగినట్లు వెల్లడించారు. ప్రధానంగా శెట్టిపల్లి హౌస్ హోల్డ్ ఓనర్స్‌కి 50 : 50 నిష్పత్తిలో అంటే 50 శాతం తుడాకు, 50శాతం హక్కుదారుడికి, అలాగే అగ్రికల్చర్ ల్యాండ్ ఓనర్స్‌కి 30 :70 నిష్పత్తిలో హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. 30 శాతం తుడా, 70శాతం రైతుకు ఇవ్వనున్నట్లు చెప్పారు. మొత్తంగా తుడాకు 65 ఎకరాలు, ప్రభుత్వానికి 90 ఎకరాలు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. శెట్టిపల్లి భూములు తిరిగి తుడా పరిధిలోకి మార్పు చేశారని చెప్పారు. తుడా రూ.200 కోట్ల పెట్టుబడి పెట్టి ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను 225 ఎకరాల్లో ఏర్పాటు చేస్తుందని తెలిపారు. 1300 మందికి రెండు సెంట్ల స్థలం వచ్చే అవకాశం ఉందని, మిగిలిన వారికి కూడా రెండు సెంట్లు కేటాయింపు చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. శెట్టిపల్లి గ్రామ ప్రజలకు అన్ని వసతులతో కూడిన లే అవుట్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుడు పి. బాబును సన్మానిస్తున్న నేతలు

విజయవాడ: గురుపూజోత్సవం సందర్భంగా తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు.

ప్రమాణాలు పెంచేందుకు సంస్కరణలు



టీటీడీ అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : శ్రీవారి సేవకులకు సంబంధించి గ్రూప్ సూపర్‌వైజర్లు, ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై ఈఓ శ్యామ ల రావు శుక్రవారం తిరుపతిలో ని టీటీడీ పరిపాలనా భవనంలో ఏపీ ప్లానింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, జేఈఓ వీరబ్రహ్మంలతో, వర్చువల్‌గా ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు విశ్వనాథ్, రామమోహన్, అడిషనల్ ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరితో సమీక్ష నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ శ్రీవారి సేవా ప్రమాణాలను మరింత పెంపొందించాలనే దిశగా పలు సంస్కరణలు చేపట్టినట్టు తెలిపారు. సీపీఆర్ఓ టి.రవి, డీఎఫ్ఓ జీఎం (ఐటీ ఇన్‌చార్జ్) ఫణి కుమార్ నాయుడు, శ్వేత డైరెక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు దర్శన భాగ్యం కల్పించి ఆలయ మర్యాదలు చేశారు. అలాగే కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇంద్రేష్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ దర్శించుకున్నారు.

శోత్రియ భూముల్లో దొంగలు పడ్డారు!



చిన్న పాండూరు ప్రధాన రోడ్డు మార్గంకు ఆనుకుని శోత్రియ భూములను దున్నేసిన ఆక్రమణదారులు

వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌వైకాలనీ ఆక్రమణలకు అడ్డాగా మారింది. పరిసర ప్రాంతాల్లో భారీగా పరిశ్రమలు రావడంతో ఈ ప్రాంతంలోని పొలాలకు ఎక్కడలేని గిరాకీ ఏర్పడింది. డీకేటీ భూమి సైతం ఎకరా రూ.కోట్లలో పలుకుతోంది. ఒక్కసారిగా ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు ఆ భూములపై కన్నేశారు. కాలనీలో గిరిజనులకు కేటాయించిన ఇంటి స్థలాలను దర్జాగా కొనుగోళ్ల పేరుతో కబ్జా చేసేశారు. అక్కడితో ఆగకుండా నాలుగురోజులగా దున్నకాలు చేపట్టారు. సాగు పేరుతో పూర్తిగా సొంతం చేసుకునేందుకు అడుగులు వేస్తున్నారు.

- దర్జాగా దున్నకాలు చేపట్టిన కబ్జాదారులు
- లబోదిబోమంటున్న గిరిజనులు
- సాగు పేరుతో వంద ఎకరాల్లో ఆక్రమణలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- కలెక్టర్ దృష్టిసారించాలని వేడుకోలు

వరదయ్యపాళెం : మండలంలోని చిన్నపాండూరు పరిధి పాదిరికుప్పం రెవెన్యూలోని 1,056 ఎకరాల శోత్రియ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. నాలుగు రోజులుగా శోత్రియ భూముల్లో ఓవైపు పొలం దున్నకాలు చేపట్టి ఆక్రమణ దశగా పావులు కదుపుతున్నారు. ఈ భూములు సత్యవేడు-చిన్న పాండూరు ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉండడంతో ఆక్రమణకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమేరకు షికారీలు ఆక్రమించుకుని, ఆ భూమి తమ పూర్వీకులకు చెందినదిగా బుకాయిస్తూ గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాగే కొనసాగితే శోత్రియ భూములు పూర్తిగా కబ్జాలోకి వెళ్లిపోయే ప్రమాదముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ

శోత్రియ భూముల ఆక్రమణలు జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రాంతంగా ఉన్న శోత్రియ భూముల్లో ఓవైపు దుక్కి దున్నకాలు, మరోవైపు గ్రావెల్ అక్రమ రవాణా, షికారీల గుడిసెలు ఇలా ఇష్టారాజ్యంగా కబ్జాల పర్వం కొనసాగుతున్నప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రధాన రోడ్డుకు రెండు వైపులా ఆక్రమణలు

చిన్న పాండూరు-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని వీకేఆర్‌వైకాలనీ సమీపంలో రోడ్డుకు తూర్పు, పడమర రెండు వైపుల సుమారు 100 ఎకరాల్లో దున్నకాలు చేపట్టి ఆక్రమణకు సిద్ధం చేసుకుంటున్నారు. అందులో పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఎకరా రూ. 10కోట్లకు పైగా విలువ కలిగిన ఈ ప్రాంతంలో ఈ స్థాయిలో ప్రభుత్వ భూములు ఆక్రమణల పాలవుతున్నా అధికారులు స్పందించడం లేదు.

కేసులు నమోదు చేస్తాం



శోత్రియ భూముల్లో అక్రమంగా దున్నకాలు చేపట్టిన విషయం ఆలస్యంగా మా దష్టికి వచ్చింది. ప్రస్తుతం వివిధ కేసులకు సంబంధించి హైకోర్టుకు హాజరయ్యా. వచ్చిన వెంటనే శోత్రియ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా. ఆక్రమణలు, ఇతర కార్యకలాపాలపై విచారణ చేపడతా. కబ్జాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

– సుధీర్ రెడ్డి, తహసీల్దార్, వరదయ్యపాళెం